క్లుప్తంగా

జెడ్పీ హైస్కూల్లో సామాజిక బృందం తనిఖీ



సమావేశంలో పాల్గొన్న అధికారుల బృందం

మార్కాపురం టౌన్: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాష్ట్ర సామాజిక తనిఖీ బృందం వివిధ అంశాలను పరిశీలించింది. ఎం.వెంకటేశ్వరరావు, జి.సత్యనారాయణ ఆధ్వర్యంలోని బృందం మధ్యాహ్న భోజనం, పీఎం పోషణ, సమగ్రశిక్ష ద్వారా అందుతున్న వివిధ రకాల వనరుల వినియోగం, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, క్రీడలు తదితర అంశాలను తనిఖీ చేసినట్లు హెచ్ఎం ఎం.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించినట్లు చెప్పారు. ఎంఈఓ 2 కె.శర్వాణి, స్టేట్ రిసోర్స్ పర్సన్ టి.వెంకటేశ్వరరావు, జిల్లా రిసోర్సుపర్సన్ జి.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు నివారించాలి



విద్యార్థులతో అవగాహన సదస్సు

గిద్దలూరు రూరల్: బాల్యవివాహాలు నివారించాలని సీడీపీఓ బి.జ్యోతి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. విద్యార్థినులు తమ హక్కులను తెలుసుకోవాలన్నారు. బాల్య వివాహాలు, లింగ వివక్షపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారతి, ఉషారాణి, సచివాలయం మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తాం

మార్కాపురం: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తామని ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ దివ్యాంగుల విభాగం అధ్యక్షునిగా నియమితులైన నుసుం బాలచంద్రుడు, బూత్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన నల్లబోతుల కొండయ్య, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా నియమితులైన చదలవాడ రమణారెడ్డి పేర్కొన్నారు. తమకు పదవులు రావడంతో సహకరించిన వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



రాచర్లలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి

రాచర్ల: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ ఎస్.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలు ఆరోగ్యంగా ఉంటేనే చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుకు సాగవచ్చన్నారు. ఏఎస్సై ఆదిశేషయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టి.మేరికుమారి తదితరులు పాల్గొన్నారు.



ఎదుర్రాళ్లపాడు సమీపంలో కనీస హెచ్చరిక బోర్డులేని చప్టా







మార్కాపురం-తర్లుపాడు రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలు, ప్రమాదకరంగా మార్జిన్

- తర్లుపాడు రోడ్డులో వాహనదారులకు తప్పని తిప్పలు
- రోడ్డంతా గుంతలు.. మార్జిన్ దిగితే అంతే సంగతులు
- బైకర్లకు ప్రమాదకరంగా గిద్దలూరులోని బ్రిటన్ రోడ్డు

ప్రయాణం.. భయానకం!

మార్కాపురం టౌన్:

రోడ్లను అద్దాల్లా మెరిపిస్తామని కూటమి పాలకులు చెప్పిందంతా బూటకమేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త రోడ్ల సంగతి పక్కనబెడితే ఉన్న రోడ్లపై గోతులు పూడిస్తే చాలని జనం కోరుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మార్కాపురం పట్టణం నుంచి తర్లుపాడు వెళ్లే రోడ్డు ఇటీవల కాలంలో గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఇది సింగిల్ రోడ్డు కావడంతో ఎదురుగా వాహనాలు వచ్చే సమయంలో మార్జిన్ దిగక తప్పదు. రోడ్డంతా గుంతలు ఏర్పడటం, మార్జిన్లు కూడా అస్తవ్యస్తంగా ఉండటంతో వాహనదారులకు ప్రయాణం సంకటంగా మారింది. గుంతలు పడి నెలలవుతున్నా మరమ్మతులు చేపట్టడంలో ఎందుకు జాప్యం జరుగుతోందో ఆర్అండ్‌బీ అధికారులకే తెలియాలి. రాత్రి వేళల్లో ఈ రహదారిలో ప్రయాణం ప్రాణాలతో చెలగాటమేనని పలువురు వాహనదారులు తమ అనుభవాన్ని చెబుతూ ఆందోళన వ్యక్తం చేశారు. మార్జిన్ దిగి ఎక్కేప్పుడు ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి గాయాలపాలైన సంఘటనలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా బ్రిటన్‌రోడ్డు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని బ్రిటన్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. పోరుమామిళ్ల నుంచి వచ్చే భారీ వాహనాలు ఎక్కువగా బ్రిటన్‌రోడ్డు మీదుగానే పట్టణంలోకి ప్రవేశిస్తాయి. అయితే రోడ్డు మధ్య భాగంలో గతంలో వేసిన ప్యాచింగ్ తారు లేచిపోయి చీలిక ఏర్పడి ప్రమాదకరంగా తయారైంది. దీని వల్ల ద్విచక్రవాహనాలపై వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు మధ్యలోని చీలికలో దిగిన బైక్ చక్రాలు మళ్లీ రోడ్డు మీదకు వచ్చే క్రమంలో అదుపుతప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ రోడ్డు గురించి అవగాహన లేని వారు ఎక్కువ మంది గాయాలపాలయ్యారు. ప్రమాదకరంగా ఉన్న చీలికను పూడ్చించాలని వాహనదారులు కోరుతున్నారు.



రేగడపల్లి వద్ద మూల మలుపులో ప్రమాదకరంగా చప్టా



గిద్దలూరు : బ్రిటన్ రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా చీలిక

చప్టాలకు రిటెయినింగ్ వాల్ నిర్మించాలి

కొనకనమిట్ల: మండలంలోని ఎదుర్రాళ్లపాడు-వాగుమడుగు రహదారి మధ్య ఉన్న చప్టాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎదురాళ్లపాడు సమీపంలో వాగుపై ఉన్న చప్టా, రేగడపల్లి మూలమలుపులో వాగుపై చప్టా నిర్మించారు.

కానీ రిటెయినింగ్ వాల్ సంగతి వదిలేశారు. దీంతో చప్టాల వద్ద వాహనాలు ఎదరుపడి సైడు ఇచ్చే క్రమంలో డ్రైవర్లతోపాటు ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రేగడపల్లి వద్ద ఉన్న చప్టా మూలమలుపులో ఉండటం వల్ల వేగంగా వచ్చే వాహనాలు ప్రమాదానికి గురయ్యే అవకాశం అధికంగా ఉంది. అధికారులు స్పందించి చప్టాల వద్ద సైడు గోడలు నిర్మించాలని, మూల మలుపుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ఎదురాళ్లపాడు, అంబాపురం, రేగడపల్లి, బోడపాడు, వాగుమడుగు, గనివానిపాడు గ్రామాల ప్రజలతోపాటు వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- మార్కాపురం డీఎస్పీ నాగరాజు

కంభం: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్త పడాలని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు సూచించారు. స్థానిక ఉదయగిరి బృందావనంలో శుక్రవారం రహదారి భద్రతపై కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల ప్రైవేట్ డ్రైవర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పొట్టకూటి కోసం ఆటోలు, ఇతర వాహనాలు నడుపుతున్న వారు చేసే చిన్న పొరపాట్ల వల్ల ప్రమాదాలు జరిగితే ఎన్నో కుటుంబాలు అన్యాయమైపోతాయన్నారు. వాహనాలు నడిపేటప్పుడు కచ్చితంగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. మద్యం సేవించి, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. రాత్రి పూట వాహనాలు నడిపే డ్రైవర్లు నిద్ర మత్తు ఆవరిస్తే వెంటనే విశ్రాంతి తీసుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లు విధిగా యూనిఫాం ధరించాలని, ముందు సీట్లో ఇరువైపులా ప్రయాణికులను కూర్చోపెట్టరాదన్నారు. అనంతరం ఆర్టీఓ అమర్‌నాథ్, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు, కంభం సీఐ మల్లికార్జున ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు నరసింహారావు, రవీంద్రారెడ్డి, సుదర్శన్ యాదవ్, మూడు మండలాల డ్రైవర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

విద్యార్థులకు బహుమతులు పంపిణీ



గొట్లగట్టు కేజీబీవీలో బహుమతులు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టులో కేజీబీవీ, జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పుట్టపర్తి శ్రీసత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో భగవద్గీతతో పాటు పలు అంశాలపై వ్యాచరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్థ సభ్యులు ఈర్ల బాలవెంకటేశ్వర్లు, కె.బిక్షం, సతీష్, సురేష్, ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, జెడ్పీ పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్లో పూర్వ విద్యార్థుల శ్రమదానం

మార్కాపురం: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం పూర్వ విద్యార్థులు శ్రమదానం చేశారు. 1986–87 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలోని పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించారు. తాము చదువుకున్న పాఠశాలలో శ్రమదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. వీరిని హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు డాక్టర్ బాషా, గుంటక సుబ్బారెడ్డి, అన్నా రాము, తన్నీరు వెంకటరమణ, పీవీ కృష్ణారావు, అనుముల రామాంజనేయులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న పూర్వ విద్యార్థులు

విద్యతోనే మహిళల అభివృద్ధి



కొనకనమిట్లలో వలంటీర్లకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఈఓపీఆర్డీ

కొనకనమిట్ల: సమాజంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యపడుతుందని ఈఓపీఆర్డీ శ్రీదేవి, ఏపీఎం సుధాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించిన విద్యా వలంటీర్లకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నిరక్షరాస్యులైన మహిళలకు చదువు నేర్పాలని వలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మండల మహిళా సమాఖ్య సభ్యులు, విద్యా వలంటీర్లు పాల్గొన్నారు.

ఆడ పిల్లలకు చదువే ప్రధానం



మార్కాపురం : గురుకులంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

- సబ్‌కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: ఆడపిల్లలకు చదువు ముఖ్యమని సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. విద్యార్థులు బేటీ బచావో.. బేటీ పడావో నినాదాలు చేశారు. తహసీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ.. ఆడపిల్లలను కాపాడాలని, బాల్య వివాహాలు నిరోధించేందుకు కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కచ్చితంగా పాఠశాలలకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బుజ్జి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని మహాత్మ జ్యోతిరావుపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. బాలికలు పౌష్టికాహారం తీసుకుంటూ చదువుపైనే దృష్టి పెట్టాలని సూచించారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సలోమీ, అసిస్టెంటు ప్రిన్సిపాల్ స్వప్న, వైద్య సిబ్బంది శ్రీకాంత్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు.

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ నీలోఫర్‌బేగమ్ మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో నేడు బాలికలు రాణిస్తున్నారని చెప్పారు. కష్టపడి చదువుకుని ఆర్థికంగా స్థిరపడాలని, ప్రభుత్వం బాలికలను సమాన అవకాశాలు కల్పిస్తుందన్నారు. బాల్యవివాహాలు, లింగవివక్ష, బాలికల అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమరరోలు: మండలంలోని అల్లినగరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం దాసరి గురుస్వామి ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బేస్తవారిపేటలో మాట్లాడుతున్న సీడీపీఓ నీలోఫర్‌బేగమ్

ప్రయాణికుల భద్రతే ముఖ్యం

మార్కాపురం: ప్రయాణికుల భద్రతే ముఖ్యంగా బస్సులు నడపాలని ఆర్టీసీ డ్రైవర్లకు డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు సూచించారు. శుక్రవారం డిపో గేట్ వద్ద నిర్వహించిన సమావేశంలో డీఎం మాట్లాడుతూ నైట్ సర్వీసుకు వెళ్లే డ్రైవర్లు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని, అలసటగా ఉన్నా, అనారోగ్యంగా ఉన్నా బస్సులు నడపవద్దని చెప్పారు. ఓవర్ టేక్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆర్టీసీపై ప్రయాణికుల నమ్మకాన్ని నిలబెడుతూ విధులు నిర్వర్తించాలని సూచించారు. సంస్థకు ఆదాయం తేవడం, ఇంధన పొదుపు పాటిస్తూ ప్రయాణికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు.



మాట్లాడుతున్న డిపో మేనేజర్ నరసింహులు

ఎరువులు, విత్తనాల దుకాణాలపై దాడులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలపై కనిగిరి ఏడీఏ ఈ.వెంకటరమణ ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. శ్రీకృష్ణ ట్రేడర్స్ దుకాణంలో సరైన పత్రాలు లేని కారణంగా రూ.2.23 లక్షల విలువైన స్టాకు విక్రయాలను నిలిపేశారు. తనిఖీలో ఏఓ విజయభాస్కర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

మంచు దుప్పటి



ఉదయం 6 గంటల వేళ కంభం రోడ్డులో పరిస్థితి

బేస్తవారిపేట/మార్కాపురం: పశ్చిమ ప్రకాశాన్ని మంచు దుప్పటి కప్పేసింది. నల్లమల అటవీ ప్రాంతానికి చేరువలో ఉన్న ఈ ప్రాంతంలో మంచు విపరీతంగా కురుస్తుండటంతో వాహనాల రాకపోకలపై ప్రభావం పడుతోంది. శుక్రవారం ఉదయం 8 గంటల తర్వాత కూడా లైట్ల వెలుగులోనే వాహనదారులు ప్రయాణం కొనసాగించారు. ప్రకృతి ప్రేమికులు మాత్రం సహజ సిద్ధమైన మంచుతెర అందాలను ఆస్వాదించారు.



బేస్తవారిపేట హైవే రోడ్డుపై దట్టమైన పొగమంచు



ఉదయం 7 గంటలకు మార్కాపురంలోని కాలేజీ రోడ్డు..



బేస్తవారిపేట సమీపంలో పొలాల వద్ద ఇలా..